Tafheemul Quran
Surah Al-Fatiha (Telugu)

తఫ్హీముల్ ఖుర్ఆన్

అల్ ఫాతిహా

(సంపూర్ణ వ్యాఖ్యానం)

ఉర్దూ అనువాదం, వ్యాఖ్యానం
మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది

తెలుగుసేత
ఎస్.ఎమ్. మలిక్

అల్ – ఫాతిహా

ప్రవేశిక

పేరు

ఈ సూరాకు "అల్ ఫాతిహా" అనే పేరు, ఇందులోని విషయానికి తగినట్లుగా పెట్టడం జరిగింది. ఒక చర్చనీయాంశాన్ని లేక ఒక గ్రంథాన్ని లేక మరే విషయాన్నయినా ప్రారంభించేదాన్ని 'ఫాతిహా' అంటారు. మరో మాటలో, ఈ పేరును 'పీఠిక' లేక 'ముందు మాట' అనే అర్థంలో ప్రయోగించడం జరిగిందన్న మాట.

అవతరణ కాలం

ఇది మహనీయ ముహమ్మద్(సఅసం) దైవదౌత్యానికి తొల్దొలినాటి సూరా. నిజానికి, నిర్ధారిత ఉల్లేఖనాలను బట్టి ముహమ్మద్ (సఅసం)పై పూర్తిగా అవతరించిన ప్రప్రథమ సూరా ఇదేనని తెలుస్తోంది. దీనికి పూర్వం కేవలం భిన్నమయిన కొన్ని ఆయత్‌లు అవతరించాయి. అవి అలక్, ముజ్జమ్మిల్, ముద్దస్సిర్ సూరాల్లో ఉన్నాయి.

విషయం

వాస్తవంగా ఈ సూరా ఒక వేడుకోలు. ఈ ఉద్గ్రంథ పఠనానికి పూనుకునే మనిషికి దైవం నేర్పిన ప్రార్థన. గ్రంథ ప్రారంభంలో దీన్ని

ఉంచడంలోగల ఉద్దేశ్యం, 'ఒకవేళ నీవు వాస్తవంగానే ఈ గ్రంథం ద్వారా ప్రయోజనం పొందగోరుతున్నట్లయితే మొదట విశ్వప్రభువును ఇలా వేడుకో' అన్నది.

మనిషి తన ఆంతర్యంలో ఏ వస్తువు పట్ల కోరిక, ప్రబలకాంక్ష కలిగి ఉంటాడో దానికోసమే సహజంగా ప్రార్థనలో వేడుకుంటాడు. ఇంకా ఏ శక్తినయితే తాను అర్థిస్తున్నాడో, ఆ శక్తి అధీనంలో తనకు కావలసిన వస్తువు ఉందని తాననుకున్న పక్షంలోనే అలా వేడుకుంటాడు. కాగా, దివ్య ఖుర్ఆన్ ప్రారంభంలో ఈ వేడుకోలును బోధించి, మనిషికి ఈ హితోపదేశం చెయ్యడం జరిగింది: అతడు ఈ గ్రంథాన్ని సన్మార్గార్థియై అధ్యయనం చెయ్యాలి. సత్యాన్వేషణా బుద్ధితో చెయ్యాలి. ఇంకా జ్ఞానానికి మూల స్థానం విశ్వప్రభువే అని గ్రహించాలి. అందుచేత మార్గదర్శకత్వం కొరకు ఆయనన్నే అర్థించి అనుసంధానానికి ఉపక్రమించాలి.

ఈ విషయాన్ని అర్థం చేసుకున్న తరువాత, ఖుర్ఆన్, ఫాతిహా సూరాల మధ్య ఉన్న నిజ సంబంధం, గ్రంథం దాని పీఠికల్లాంటిది కాదనీ, అది విన్నపం, దానికి సమాధానంలాంటి సంబంధం అనీ దానంతట అదే విశదమవుతోంది. ఫాతిహా సూరా దాసుని తరఫున ఓ వేడుకోలు. ఖుర్ఆన్ దైవం తరఫున దానికి సమాధానం. దాసుడు, "ప్రభూ, నాకు సన్మార్గం చూపు" అని వేడుకుంటాడు. సమాధానంగా ప్రభువు మొత్తం ఖుర్ఆన్ గ్రంథాన్ని అతని ముందుంచుతాడు - "ఇదీ నీవు నన్ను అర్థించిన ఆ మార్గదర్శకత్వం, ఆ బోధన" అంటూ.

అపార కృపాశీలుడు, పరమ కరుణామయుడు, అల్లాహ్ పేరుతో

اٰيَاتُهَا ٧ (١) سُوْرَةُ الْفَاتِحَةِ مَكِّيَّةٌ (٥) رُكُوْعُهَا ١

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۙ﴿١﴾ الرَّحْمٰنِ المنزل ١
الرَّحِيْمِ ۙ﴿٢﴾ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ؕ﴿٣﴾
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ؕ﴿٤﴾
اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۙ﴿٥﴾ صِرَاطَ
الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ﴿٦﴾ غَيْرِ ع ١ / ٧
الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ﴿٧﴾

అల్ - ఫాతిహా

అవతరణ : మక్కా **ఆయతులు : 7**

అపార కృపాశీలుడు, పరమ కరుణామయుడు,
అల్లాహ్ పేరుతో[1]

స్తోత్రం కేవలం అల్లాహ్ కొరకే.[2] ఆయన నిఖిల జగతికి ప్రభువు,[3] అపార కృపాశీలుడు, పరమకరుణామయుడు,[4] ప్రతిఫల దినానికి స్వామి[5] మేము ఆరాధించేది[6] నిన్నే, సహాయం కొరకు అర్థించేదీ నిన్నే.[7] మాకు ఋజుమార్గం చూపించు.[8] నీవు వరమనుగ్రహించినవారి,[9] ఆగ్రహానికి గురికానివారి, మార్గవిహీనులు కానివారి[10] మార్గం.

---

1. ఇస్లామ్ మనిషికి బోధించే సభ్యతా సంస్కారాల్లో ఒక నియమం ఏమిటంటే మనిషి తాను చేసే ప్రతి పనిని ప్రారంభిస్తూ దైవనామ సంస్మరణ చేయాలి. ఈ నియతిని క్రమబద్ధంగా, సచేతనంగా, చిత్తశుద్ధితో పాటించినట్లయితే దానివల్ల తప్పనిసరిగా మూడు ప్రయోజనాలు చేకూరుతాయి. మొదటిది, మనిషి అనేక చెడు పనుల నుండి తప్పించుకుంటాడు. దైవనామం స్మరించే అలవాటు, ప్రతి పనిని ప్రారంభించేటప్పుడు, ఈ

పనిని చేస్తూ నేను దైవ నామం స్మరించడం భావ్యమేనా? అన్న ఆలోచనకు అతన్ని తప్పక గురిచేస్తుంది. రెండవది, ధర్మ బద్ధమయిన, సరయిన, మంచి పనులు ప్రారంభిస్తూ దైవనామం స్మరించడం వల్ల మనిషి బుద్ధి పూర్తిగా సరయిన దిశలో పయనిస్తుంది. అతడు నిత్యం అత్యుత్తమ స్థాయి నుండి కార్యోన్ముఖుడవుతాడు. మూడవదీ అన్నింటికన్నా గొప్పదీ అయిన ప్రయోజనం ఏమిటంటే, అతను దైవనామంతో తన పనిని ప్రారంభిస్తే దేవుని సహాయం, ఆయన ప్రసాదించే సద్బుద్ధీ అతనికి తోడవుతాయి. అతని కృషిలో శుభమూ, శక్తీ, వృద్ధీ చేకూరుతాయి. షైతాన్ రేపే కలతల నుండి అతను రక్షణ పొందుతాడు. దేవుని పద్ధతి ఏమిటంటే, దాసుడు తన వైపునకు ధ్యానం మరల్చినప్పుడు తాను కూడా దాసుని కటాక్షిస్తాడు.

2. మేము ప్రవేశికలో పేర్కొన్నట్లు ఫాతిహా సూరా వాస్తవానికి ఒక వేడుకోలు. కాని ఎవరినయితే మనం వేడుకోదలిచామో ఆయన స్తోత్రంతో వేడుకోలు ప్రారంభించడం జరుగుతోంది. అంటే "వేడుకుంటున్నప్పుడు సంస్కారవంతంగా వేడుకోండి. నోరు విప్పగానే తమ ఉద్దేశ్యాన్ని వ్యక్తం చెయ్యడం సభ్యత అనిపించుకోదు. సభ్యతా సంస్కారాలననుసరించి ఎవరినయితే మీరు అర్థిస్తున్నారో, ఆయనలోని మంచిని ఆయన ఉపకారాలను, ఆయన ఉన్నత స్థానాన్ని ముందు గుర్తించాలి" అని బోధించడం జరిగిందన్నమాట.

మనం ఎవరిని ప్రశంసించినా రెండు కారణాల వల్ల ప్రశంసిస్తాము. ఒకటి, ఆయన స్వయాన శ్రేష్ఠత, ఉత్కృష్టత, పరిపూర్ణత కలిగినవాడయి ఉండాలి - ఆయనలోని ఈ గొప్పతనాల ప్రభావం మనపై ఉన్నా లేకపోయినా సరే. రెండు, ఆయన మనకు మేలు చేసినవాడయి ఉండాలి. ప్రాప్తమయిన ఆ వరప్రసాదాల పట్ల కృతజ్ఞతా భావంతో మనం తన్మయులమై ఆయన గుణగణాలను కొనియాడుతాము. అల్లాహ్ ప్రస్తుతి ఈ రెండు విధాలుగానూ చెయ్యాలి. ఆయన ఘనతను గుర్తించినందుకును, ఆయన పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉన్నందుకు కూడా మనం ఆయన్ని సతతం ప్రస్తుతించడం అవసరం.

'అల్లాహ్‌కు స్తోత్రం' అన్నంత మాత్రాన సరిపోదు. సరయిన మాట 'స్తోత్రం, కేవలం అల్లాహ్ కొరకే, అన్నది. ఈ మాట ద్వారా ఓ మహత్తరమయిన యదార్థాన్ని బహిర్గతం చెయ్యడం జరిగింది. ఆ యదార్థం ఎంత బలమయిం దంటే దాని తొలి దెబ్బకే సృష్టి పూజ సమూలంగా తుడిచి పెట్టుకుపోతుంది. ప్రపంచంలో ఎక్కడ, ఏ వస్తువులో, ఏ రూపంలో ఏమాత్రం సౌందర్యం ఉన్నా, శ్రేష్ఠత ఉన్నా, సంపూర్ణత ఉన్నా దాని మూలాంకురం అల్లాహ్‌యే. ఏ మనిషి, ఏదైవదూత, ఏ దేవత, ఏ గ్రహం - ఒక్క మాటలో సృష్టిలోని దేని ప్రశస్తత అయినా, అది దాని స్వయం సముపార్జితం కాదు, అల్లాహ్ ప్రసాదితం మాత్రమే. అందువల్ల మనం ఎవరిని మోహావేశంతో ప్రేమించాలన్నా, ఎవరిని భక్తితో పూజించాలన్నా, ఎవరి మేలును మరవ

కుండా కృతజ్ఞతలు చెల్లించుకోవాలన్నా, ఎవరికి వినమ్రులమయి సేవకులమయి ఉండాలన్నా - వీటికి అర్హుడు 'కౌశల్యస్రష్ట' యే కాని 'కౌశల్యవంతుడు' కాదు

3. రబ్ అనే పదాన్ని అరబీ భాషలో మూడు అర్థాల్లో ప్రయోగిస్తారు. (1) యజమాని, స్వామి. (2) పోషకుడు, శిక్షణ ఇచ్చేవాడు, కనిపెట్టి ఉండేవాడు, కాపరి (3) పాలకుడు, అధికారి, వ్యూహరచయిత, పరిపాలనాదక్షుడు. అల్లాహ్, ఈ అర్థాలన్నింటి ప్రకారమూ విశ్వానికి 'రబ్' లేక ప్రభువు.

4. మానవుని ప్రత్యేక గుణం ఏమిటంటే ఏదయినా అతనికి అధికంగా గోచరిస్తే అతను దాన్ని అతిశయ వాచకాలలో వర్ణిస్తాడు. ఒక అతిశయ వాచకం ప్రయోగించి, ఆ వస్తువు విస్తృతి సరిగ్గా వ్యక్తం కాలేదని భావిస్తే అతను అదే అర్థం గల మరో పదాన్ని ప్రయోగిస్తాడు - మొదటి అతిశయ వాచకంలో ఉన్న లోపాన్ని పూరించడానికి. అల్లాహ్ ప్రస్తుతిలో 'రహ్మాన్' అన్న పదం ప్రయోగించిన తరువాత మళ్ళీ 'రహీమ్' అనే మాటను అదనంగా వాడటంలో గల నిగూఢాంశం కూడా ఇదే. 'రహ్మాన్' అరబీ భాషలో మహాతిశయ వాచకం. కాని తన సృష్టిపై దేవుని కారుణ్యం, కటాక్షం ఎంత విరివిగా, ఎంత విస్తృతంగా, ఎంత అనంతంగా, అగణ్యంగా ఉందంటే దాన్ని వర్ణించడానికి ఎంత ఘనమయిన అతిశయ వాచకం ప్రయోగించినా తృప్తికలగదు. అందువల్ల దాని సమృద్ధతను

చాటడానికి తిరిగి 'రహీమ్' అన్న పదాన్ని అదనంగా ప్రయోగించడం జరిగింది. దీనికి ఉదాహరణ చెప్పుకోవాలంటే ఇలా అనుకోవచ్చు. ఐశ్వర్యాన్ని చాటడానికి మనం సిరి అన్న పదం ప్రయోగించి తృప్తి కలగకపోతే 'సంపద' అన్న పదాన్నీ దానికి జోడిస్తాము. దాతృత్వం విషయంలో 'దానం' అనడంతో తృప్తిచెందక 'ధర్మం' అని కూడా పలుకుతాము. స్పష్టతను విస్పష్టం చెయ్యడానికి 'తేట' అన్న పదం చాలదనిపిస్తే 'తెల్లి' అన్నదాన్నీ కలుపుకుంటాము.

5. అంటే, ఆద్యంత తరాలను సమావేశపరచి వారి జీవన కార్యకలాపాల చిట్టా తనిఖీ చేయడం జరిగి, ప్రతి మనిషికీ, అతని కర్మానుసారం పరిపూర్ణ ప్రతిఫలం ప్రదానం చేసే దినానికి స్వామి అన్నమాట. అల్లాహ్ ప్రస్తుతిలో 'రహ్మాన్', 'రహీమ్' (అపార కృపాశీలుడు, పరమ కరుణామయుడు) అన్న పదాలను ఉపయోగించి తరువాత ప్రతిఫల దినస్వామి అనడం ద్వారా, ఆయన కేవలం కృపాశీలుడే కాదు, న్యాయశీలుడు కూడాను అన్న భావం వస్తుంది. అదీ ఎలాంటి సాధికార న్యాయశీలుడంటే చివరి తీర్పు దినాన సమస్త అధికారాలు ఆయనకే హస్తగతమయి ఉంటాయి. ఎవరయినా సరే, ఆయన ఇచ్చే శిక్షనూ వారించలేరు, ప్రతిఫలాన్నీ ఆపలేరు. అందువల్ల మనం ఆయన ప్రభుతను పురస్కరించుకుని, ఆయన కారుణ్యానికి ప్రభావితులమయి ఆయన్ని ప్రేమించడం మటుకే కాదు, ఆయన చేసే న్యాయం కారణంగా ఆయనకు భయపడ

తాము కూడా. ఫలప్రాప్తి దశలో మనకు జరిగే మంచి అయినా, చెడు అయినా పూర్తిగా ఆయన అధీనంలోనే ఉన్నాయన్న భావన కూడా కలిగి ఉంటాము.

6. 'ఇబాదత్' అన్న పదం కూడా అరబీ భాషలో మూడు అర్థాల్లో ప్రయోగిస్తారు. (1) ఉపాసన, ఆరాధన, (2) విధేయత, ఆజ్ఞాపాలన, (3) దాస్యం, బానిసత్వం. ఇక్కడ ఈ మూడు అర్థాలనూ ఉద్దేశించడం జరిగింది. అంటే మేము నీ ఉపాసకులము, ఆజ్ఞాబద్ధులము, సేవించే దాసులము కూడా అని భావం. నీతో మేము ఈ సంబంధం కలిగి ఉంటున్నాము అన్నంతవరకే ఈ విషయం, పరిమితం కాదు. వాస్తవానికి అసలు విషయం ఏమిటంటే ఈ సంబంధం మాకు కేవలం నీతో మటుకే ఉంది. ఈ మూడు అర్థాల్లో ఏ ఒక్క అర్థం ప్రకారమయినా మరొకరెవరూ మాకు దైవం కాదు.

7. అంటే మా సంబంధం నీతో కేవలం ఆరాధన వరకే పరిమితం కాదు, సహాయార్థన సంబంధం కూడా మాకు నీతోనే ఉంటుంది. మాకు తెలుసు, సర్వసృష్టికి ప్రభువు నీవే; శక్తులు సమస్తం నీ అధీనంలోనే ఉన్నాయి; సకల వరాలకు నీవొక్కడివే ఏకైక స్వామివి. అందువల్ల మా అవసరాలకై వేడుకుంటూ మేము నీ వైపునకే మరలుతాము; నీ సమక్షంలోనే చేయి చాచి అర్థిస్తాము; నీ సహాయంపైనే మాకు భరోసా, ఈ కారణం చేతనే మేము

ఈ దరఖాస్తును తీసుకుని నీ సన్నిధానంలో హాజరయ్యాము.

8. అంటే ప్రతి జీవనరంగంలో ఆలోచన, ఆచరణ, ప్రవర్తనల సవ్యమయిన మార్గం మాకు చూపు. అది వక్ర దృష్టి, వికృతాచరణ, దుష్ట పరిణామాల ప్రమాదం లేనిదయి ఉండాలి. దాన్ని అవలంబించి మేము నిజమైన సాఫల్యం, శుభశ్రేయాలు పొందగలగాలి - ఇదీ ఆ ప్రార్థన, దివ్య ఖుర్ఆన్ పారాయణం ప్రారంభిస్తూ దాసుడు తన దైవం సన్నిధిలో నివేదించుకునే ప్రార్థన. అతని మనవి ఏమంటే, నీవు మాకు మార్గం చూపు, ఊహాజనిత తత్వాల పద్మవ్యూహాల్లో అసలు యదార్థమయిన విషయం ఏదో, ఈ విభిన్న నైతిక దృక్పథాల్లో సరయిన నైతిక విధానం ఏదో, జీవితపు ఈ అసంఖ్యాక కాలిబాటల మధ్యన ఆలోచన ఆచరణల ధర్మపథం, నేరుగా, సాఫీగా సాగే రాచబాట ఏదో? మాకు తెలుపు అన్నది.

9. మనం ఏ మార్గజ్ఞానం కావాలని అల్లాహ్‌ను అర్థిస్తున్నామో, ఇది ఆ ఋజు మార్గానికి నిర్వచనం, అంటే నీ ప్రేమ పాత్రులయినవారు సదా నడుస్తూ ఉన్న మార్గం, ఎంత మాత్రం దిశ తప్పని మార్గం. అత్యంత ప్రాచీన కాలం నుండి నేటి వరకు దాన్ని ఏ వ్యక్తి, ఏ సమాజం, ఎవరు అనుసరించినా వారు నీ బహుమానాలకు అర్హులయ్యారు, నీ వరాలతో సుసంపన్నులయ్యారు - ఆ మార్గం అన్నమాట.

10. "వరం" పొందేవారంటే మా ఉద్దేశ్యం, నీవు ప్రసాదించే ప్రాపంచిక వర ప్రసాదాలను పొంది తాత్కాలికంగా ధన్యులయి నట్లు అగుపించినా, వాస్తవానికి నీ ఆగ్రహపాత్రులయినవారు, తమ సాఫల్యశ్రేయాల మార్గాన్ని కోల్పోయిన వారు అన్నది కాదు. ఈ నకారాత్మక వివరణ వల్ల "వరం" అంటే యదార్థ మయిన, సుస్థిరమయిన వరాలనీ సత్యపథ గమనం వల్ల, దైవ ప్రసన్నతకు ఫలితంగా లభించే వరాలనీ, దీనికి భిన్నంగా తాత్కాలికమయినవి, పైపై మెరుగుల్లాంటివి, మునుపు కూడా ఫిరౌనులకు, నమ్రూదులకు, హామానులకు లభిస్తూ ఉన్న వరాలు కావనీ, ఇంకా నేడు కూడా మన కళ్ళముందరే మహా గొప్ప దౌర్జన్యపరులకు, దుర్మార్గులకు, మార్గవిహీనులకు ప్రాప్తమవుతూ ఉన్న వరాలు కావని దానంతటదే విశదమవుతోంది.

—:సమాప్తం:—